క్లుప్తంగా

అక్కమాంబ జాతరలో డ్రోన్‌తో నిఘా



కళ్యాణదుర్గంలో అక్కమాంబ అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని వైభవంగా జరిగే అక్కమాంబ జాతరను డ్రోన్‌తో నిఘా ఉంచనున్నారు. సోమవారం వైభవంగా జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా డ్రోన్లతో నిఘా పెట్టారు.

వేరుశనగ వాములు దగ్ధం

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలో ఆదివారం కొత్తపల్లి రామాంజనేయులు, ఎం.పోతప్ప అనే రైతులకు చెందిన వేరుశనగ పొట్టు వాములు కాలిపోయాయి. ఉన్నపళంగా మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు గమనించి రైతులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకునేలోపు అప్పటికే వాములు కాలిపోయాయి. రూ.2లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉగాది పురస్కారం అందుకున్న మఠం నాగరాజు



మఠం నాగరాజుస్వామిని సత్కరిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: జరుట్లరాంపురంలోని జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మఠం నాగరాజు స్వామి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ చేతులమీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాలు – 2025 అందజేత, సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మఠంనాగరాజుస్వామి మాట్లాడుతూ కలెక్టర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

3న సామాజిక తనిఖీ ప్రజావేదిక

వజ్రకరూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏప్రిల్ 3న 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 20 24 మార్చి 31 వరకు ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై ఈనెల 23వ తేదీ నుంచి 31వ వరకు 19 పంచాయతీల్లో సామాజిక తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే!



టీచర్స్ కాలనీవైపు వెళ్లే దారిలోని చెత్తకుప్పలో ఇలా..



చంద్రబాబు కాలనీలోని బాలికల వసతి గృహం వద్ద ఇలా..

మున్సిపాలిటీ పరిధిలో చెత్త నిర్వహణ ఇలా..

పట్టణ జనాభా	75 వేలు
మొత్తం వార్డులు	32
వార్డు సచివాలయాలు	18
రోజూ చెత్త ఉత్పత్తి (టన్నుల్లో)	27
తడి చెత్త	16 టన్నులు
పొడి చెత్త	11 టన్నులు

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రాయదుర్గంలో పారిశుధ్యం అధ్వానం
- రోడ్ల వెంబడి పేరుకుపోతున్న ప్లాస్టిక్ కవర్లు

రాయదుర్గం: పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. కొన్ని కాలనీల్లో ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రధాన రహదారుల్లో మినహా, మిగిలిన కాలనీల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగలేదు. దీంతో ఇక స్లమ్ వార్డుల్లో పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. రాయదుర్గం పట్టణంలోని 32 వార్డులు 75 వేల మంది జనాభా ఉంది. రోజూ తడి, పొడి చెత్త 27 టన్నులు సేకరించి, వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు ఉదయం 5:30కు విధుల్లోకి వచ్చి ఎఫ్ఆర్ఎస్ వేయించుకొని వారికి కేటాయించిన ప్రధాన రహదారులు, వార్డుల వారీగా విధులు నిర్వహించాలి. మరికొందరు మున్సిపల్ వాహనాల వెంట వెళ్లి ఇంటింటా చెత్త సేకరించాల్సి ఉంటుంది. ఇలా సేకరించిన చెత్తను బళ్లారి రోడ్డు శాంతినగర్ చివర్లో ఉన్న డంపింగ్ యార్డులు తరలించాల్సి ఉంది.

శాశ్వత కార్మికులకు బదులు మరొకరు..

మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, దినసరి కూలి ప్రాతిపదికన వెళ్లే కార్మికులు ముందుగానే సంబంధిత అధికారులతో ఒప్పందం చేసుకుంటున్నారు. ఉదయం హాజరు వేసుకొని వెళ్లిపోతున్నట్లు సమాచారం. ఆ రోజు వేతనంలో కొంత హాజరు చూసే వారికి ఇస్తున్నట్లు సమాచారం. ఇలా ప్రతి వార్డులోనూ ఒకరిద్దరు కార్మికులు ఉంటున్నారు. శాశ్వత పారిశుధ్య కార్మికులకు బదులుగా వేరేవారిని పనుల్లో పెడుతున్నా అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో ఉండాల్సిన అధికారి, వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు సక్రమంగా పర్యటించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పర్యవేక్షణ లోపం ..

పర్యవేక్షణ లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. పట్టణంలోని రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లను సకాలంలో ఎత్తకపోవడంతో ఎక్కడికక్కడ అపరిశుభ్రత తాండవిస్తోంది. చెత్త సేకరించేందుకు వినియోగించే ఈ– ఆటోలు వివిధ కారణాలతో కార్యాలయంలో మూలకుచేరాయి. దీంతో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

ప్రత్యేక దృష్టి సారిస్తాం



ఇళ్ల నుంచి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పర్యవేక్షణ లోపం లేకుండా చూస్తాం. ప్రజలకు అవగాహన కల్పించి, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని ప్రచారం చేస్తాం. ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి శుద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం. సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. చెత్త సేకరణలో లోపాలు లేకుండా చూస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం



కణేకల్లు రోడ్డులోని రైల్వే అండర్‌పాస్ కింద పేరుకుపోతున్న చెత్త

దానధర్మాలకు ప్రతీక రంజాన్



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: దానధర్మాలకు ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన తనయుడు, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి ఆదివారం తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి ఐదు పూటలా నమాజ్, ఖురాన్ పఠనం చేస్తూ అల్లాహ్ ఆరాధనలో ఉండటం గొప్ప విషయమన్నారు. ఇంతటి గొప్ప మాసంలో పేదలకు ముస్లింలు దానధర్మాలు చేస్తూ అల్లా చూపిన మార్గంలో వెళ్లడం ఆదర్శనీయమన్నారు.

అల్లా కృపతో సుఖ సంతోషాలు



మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలియజేశారు. నెలరోజుల పాటు చేసిన ఉపవాస దీక్షలతో ఆధ్యాత్మిక చింతన, సేవా దృక్పథం, సహనం, క్రమశిక్షణ, అల్లా పట్ల భక్తిభావాలు పెంపొందుతాయన్నారు. నియోజకవర్గంలోని పట్టణంతోపాటు ఐదు మండలాల్లోని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు



తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: నియోజవర్గంలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలు కుటుంబికులతో కలిసి భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగ జరుపుకోవాలని కోరారు.

ప్రవీణ్ పగడాల మృతిపై విచారణ చేపట్టాలి



ఉరవకొండలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు

ఉరవకొండ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేస్తు ఉరవకొండలో ఆదివారం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భారీగా శాంతి ర్యాలీ చేశారు. స్థానిక క్లాక్ టవర్ నుంచి అన్ని చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు. పాస్టర్ ప్రమీలాజోసఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినకుండా నిజాలు వెలుగులోకి తీసుకోరావాలన్నారు. అనంతరం ఏఎస్ఐ పాల్‌కు వినతిపత్రం అందించారు.

ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా మైదానం



ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబైన ఉరవకొండ ఈద్గా మైదానం



ఈద్ నమాజ్‌కు సిద్ధమైన బళ్లారి రోడ్డు ఈద్గా మైదానం

ఉరవకొండ: రంజాన్ నెలవంక దర్శనంతో ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనల కోసం ఆదివారం ఏర్పాట్లు చేశారు. ఈద్గా ఖబరస్తాన్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్గా మైదానంలో చురుగ్గా కార్యక్రమాలు నిర్వహించారు. మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఈఓ గౌస్‌సాహెబ్ పర్యవేక్షణలో సిబ్బంది ఈద్గా ప్రదేశంలో శుభ్రం చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు తొలగించారు. అనంతరం రోడ్డును మట్టితో మరమ్మతులు చేయించారు. ఈద్గా ముఖద్వారాన్ని రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 8.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభమవుతాయని ప్రభుత్వ ఖ్వాజీ యూనుస్ తెలిపారు.

నేడు భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫిత్ర్

రాయదుర్గంటౌన్: నెలరోజుల పాటు మండుటెండల్లో నియమ నిష్ఠలతో ముస్లింలు చేపట్టిన రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం నాటితో ముగిశాయి. నెలవంక దర్శనంతో 'ఈదుల్ ఫిత్ర్' రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. పట్టణంలోని ఈద్గా మైదానాలను ఈదుల్ ఫిత్ర్ నమాజ్ కోసం సిద్ధం చేశారు. బళ్లారి రోడ్డు ఈద్గా మైదానికి ప్రత్యేక నమాజ్ (ఈదుల్ ఫిత్ర్)కు ముస్లింలు సకాలంలో చేరుకోవాలని ఖాజీ సైపుల్లా తెలిపారు. కణేకల్లు రోడ్డు ఈద్గా మైదానానికి ఈద్ నమాజ్‌కు నిర్ణీత సమయం కంటే ముందుగా చేరుకోవాలని ప్రభుత్వ ఖాజీ అతావుర్ రెహమాన్ తెలిపారు.

ఈద్గాల్లో ఈద్ నమాజ్ వేళలు:

బళ్లారి రోడ్డు ఈద్గా మైదానంలో నమాజ్ సమయం: ఉదయం 8.15 గంటలు, కణేకల్లు రోడ్డు ఈద్గా మైదానంలో నమాజ్ సమయం : ఉదయం 7.15 గంటలకు, బీటీపీ బైపాస్ రోడ్డు ఈద్ మైదానంలో నమాజ్ సమయం: ఉదయం 7.30 గంటలకు, బళ్లారి రోడ్డు దర్గా మసీదులో నమాజ్ సమయం : ఉదయం 8.45 గంటలకు ఈద్ నమాజ్ జరుగుతుంది.

వైద్యం అందక అవస్థలు



కూడేరు: కూడేలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆస్పత్రి. పీహెచ్‌సీ పరిధిలో 28 గ్రామాలుండగా సుమారు 40 వేలుకు పైగా జనాభా ఉన్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన వైద్యం ఈ పీహెచ్‌సీకే వస్తారు. మరోపక్క ఆత్మకూరు మండలం సింగపల్లి, తలుపూరు ప్రజలు కూడా వస్తారు. రోజుకు 80నుంచి 130 దాగా ఓపీ ఉంటుంది. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులుండగా ప్రధాన వైద్యుడు లక్ష్మీనారాయణ ఈ నెల 2న విజయవాడలో ఉన్నత విద్యనభ్యసించడానికి ప్రభుత్వం తరుపున సీటు రావడంతో వెళ్లిపోయాడు.మరొక వైద్యురాలు సౌమ్యా రెడ్డి 104 వాహనం వైద్య సేవలందించడానికి గ్యామాల్లో క్యాంపులకు, సమావేశాలకు వెళుతుంటారు. దీంతో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు. వైద్యురాలు లేనపుడు స్టాఫ్ నర్సులే వైద్య సేవలందించాల్సి వస్తోంది. వైద్య సేవలు సక్రమంగా అందకపోవడంతో గత్యంతరం లేక రోగులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలకు వెళ్లి వైద్యం చేయంచుకుంటున్నారు. దీంతో ఆర్థికంగా భారమవుతోందని రోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీపడిన డాక్టర్ పోస్టును భర్తీ చేసి వైద్య సేవలందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సుర్రుమంటున్న సూరీడు

రాయదుర్గంటౌన్:ఎండలు భగ్గుమంటున్నాయి. ఎండదెబ్బకు ప్రజలు విలవిలలాడుతున్నారు. క్రమంగా ఉష్ణోగ్రత తార స్థాయికి చేరుతోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీలు నమోదైంది. దీంతో ప్రజలు మధ్యాహ్నం 12 గంటలయితే చాలు రోడ్లపైకి రావడంలేదు. ఎండతోపాటు వేడిగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరివుతున్నారు. ఉగాది పండుగ పూట కూడా రహదారులు నిర్మానుష్యంగా కనిపంచాయి. కాలనీలు, వీధుల్లో సైతం ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఎండవేడిమిని తట్టుకొనేందుకు ప్రజలు శీతలపానీయాలు వైపు మొగ్గుచూపుతున్నారు.

ఊరూరా ఉగాది సందడి



వజ్రకరూరులో అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి



పూజలందుకున్న ప్రసన్న వేంకటరమణస్వామి



ఉరవకొండలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా సంప్రదాయ వస్త్రధారణలో ర్యాలీ నిర్వహిస్తున్న పిల్లలు, పెద్దలు



ఉరవకొండ: ఉగాది పురస్కారాల్లో భాగంగా వెంకట్, ఓబులేసును సన్మానిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, సీఐ గౌస్



అలంకరణలో పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి



విశేష అలంకరణలో పార్కు ఆంజనేయస్వామి



విశేష అలంకరణలో దుర్గాభవాని అమ్మవారు



వజ్రకరూరులోని అలంకరణలో భోగేశ్వరస్వామి



రాయదుర్గం: లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రాయదుర్గం/రాయదుర్గంటౌన్: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల ప్రజలు విశ్వావసు నామ ఉగాది పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రముఖ, ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలన్నీ భక్తులతో ఉదయం నుంచి సాయంత్రం దాక కిటకిటలాడాయి. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. రాయదుర్గంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం, నేసేపేటలోని సత్యనారాయణస్వామి ఆలయంలో విశ్వావసు నామ ఉగాది పండుగను ఆదివారం జరుపుకున్నారు. సాయంత్రం ఆలయంలో ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. పట్టణంలోని వేణుగోపాలస్వామి, దశభుజ గణపతి, జంభుకేశ్వరస్వామి, చన్నవీరస్వామి, మార్కండేయస్వామి ఆలయం, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి కుటుంబ సభ్యులతో కలసి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన వ్యవసాయ క్షేత్రంలో వేదపండితులతో కలసి షడ్రుచుల పచ్చడి స్వీకరించారు. మెట్టు మాట్లాడారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఉగాది పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటా గుమ్మాలకు మామిడితోరణాలు, వేపాకు, పూతతో అలంకరించారు.

కణేకల్లు: కణేకల్లులో ఉగాది పండుగ వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో మంచి జరగాలని చిక్కణ్ణేశ్వరస్వామి, స్వయంభేశ్వర, సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయానికి సాయంకాలం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు విశ్వనాథస్వామి, మృత్యుంజయ్యలు పంచాంగాన్ని పఠించారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం విశ్వావసు నామ ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప, ఆలయ కమిటీ అధ్యక్షుడు గెల్లి రామరాజు ఆధ్వర్యంలో అర్చకులు పంచాంగ శ్రవణం గావించారు.

వజ్రకరూరు: మండలంలో మేజర్ పంచాయతీలు అయిన వజ్రకరూరు, కొనకొండ్ల గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. జనార్దన వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయి, నగరేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి, మారెమ్మ, సుంకులమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా ఉగాది పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. వేంకటేశ్వరస్వామి, సత్యనారాయణ స్వామి, నేమకల్లు ఆంజనేయస్వామి, ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి, కందేపల్లి ఆంజనేయస్వామి, సంగమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

కూడేరు: మండల ప్రజలు ఆదివారం ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కూడేరులోని షిర్డి సాయిబాబా, జోడు లింగాల సంగమేశ్వర స్వామి, రామాలయం, బసాపురం ఆంజనేయ స్వామి, కలగళ్ల, కడదరకుంటలోని ఆంజనేయ స్వామి, ముద్దలాపురం, కరుట్లపల్లిలోని రామాలయాలు, కొర్రకోడులోని శివాలయంలో పూజలు చేశారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

ఉరవకొండ: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్‌లు తెలిపారు. ఆదివారం పట్టణానికి చెందిన ఆయూర్ సంస్థ ఆధ్వర్యంలో ఉరగాద్రి ఉగాది వేడుకలు నిర్వహించారు. స్థానిక మార్కండేయస్వామి ఆలయం నుంచి తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ఆయూర్ ప్రతినిధి వెంకట్‌తాటికొండ ఆధ్వర్యంలో సంప్రదాయ వస్త్రాలు ధరింపజేసి, ర్యాలీగా క్లాక్‌టవర్ వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్దకు వెళ్లారు. అనంతరం గవిమఠం ఆవరణలో స్వచ్ఛంద సేవకులను సన్మానించారు. అనంతరం లయన్స్‌క్లబ్, శ్రీగీతా ప్రచారసమితి, ఆపద్బాంధవ, అచ్యుతాశ్రమం, సప్తగిరి ఫౌండేషన్, అమ్మ తొలి దైవం, జైకిసాన్ ఫౌండేషన్, నిస్వార్థ సంస్థ, విఠల్ రుక్మిణి ఆశ్రమం ప్రతినిధులను సన్మానించారు. నిస్వార్థ సంస్థ, జైకిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్ తాటికొండ, నాగమల్లి ఓబుళేసులకు గవిమఠం ఉత్తరాధికారి, రూరల్ సీఐలు సత్కరించారు.

పార్కు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

ఉరవకొండ: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉరవకొండ పట్టణంలోని పార్కు ఆంజనేయస్వామి, 11వార్డు ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉగాదిని పురస్కరించుకొని స్వామికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. ఉరవకొండ దుర్గాభవాని ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెన్నహోబిలంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు ద్వారకానాథాచార్యులు, బాలాజీ స్వామి, రామకృష్ణ, గుండురావులకు కాటన్‌పంచె, కండువాలు అందించారు.

వజ్రకరూరు: చాబాల చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం పంచాంగ శ్రవణం చేశారు. వేదపండితులు కరణం శ్రీనివాసరావు పంచాంగ చదివి వినిపించారు. విశ్వావసునామ సంవత్సరంలో సకాలంలో వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఎర్రనేలలు,నల్లరేగడి భూముల్లో పంటలు పండుతాయని తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం, మంజునాథస్వామి ఆలయంలో పండితులు చిరంజీవిశాస్త్రి పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. రామేశ్వరాలయం, నగరేశ్వరాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, రమనేపల్లి ఆంజనేయస్వామి, బూదిగుమ్మ హనుమంతరాయస్వామి ఆలయం, పద్మావతి వెంకటరమణస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.




కూడేరు: రామాలయంలో సీతారాములుకు పూజలు చేస్తున్న దృశ్యం




బెళుగుప్పలోని మంజునాథస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు



బెళుగుప్పలో ప్రత్యేక పూజలందుకున్న విఘ్నేశ్వరస్వామి



పెన్నహోబిలంలో ఉగాదిని పురస్కరించుకొని ఆలయ అర్చకులను సత్కరిస్తున్న ఈఓ



కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయంలో పంచాంగాన్ని పఠిస్తున్న అర్చకులు



నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితులు